సాక్షి ఆదిలాబాద్

బుధవారం | 26 | మార్చి | 2025



రైతు ఆత్మహత్యలపై విచారణ

తలమడుగు మండలంలో ఇటీవల ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకోగా ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు ఆయా గ్రామాల్లో విచారణ చేపట్టారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం : 6:24	గురువారం : 4:58

గరిష్ఠం/కనిష్ఠం
38.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు బాధిత కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గతేడాది తాంసి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ ఎం.గంగన్న మృతిచెందిన విషయం తెలిసిందే. ఈమేరకు ఆయన భార్య ప్రమీళకు మంగళవారం పోలీసు కార్యాలయంలో రూ.8 లక్షల భద్రత చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైనా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో భక్త ప్రహ్లాద్, సీసీ దుర్గం శ్రీనివాస్, సూపరింటెండెంట్ గంగాధర్, వెంకటేశ్వర్లు, జైస్వాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు రిలే దీక్షలు



దీక్షలో కూర్చున్న యువకులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో మూతపడ్డ సిమెంట్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలనే డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలేదీక్షలు మంగళవారంతో ఏడో రోజుకు చేరాయి. ఇందులో పట్టణంలోని 18,19,16 వార్డులకు చెందిన యువకులు కూర్చున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీఐ సాధన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రేషన్‌కార్డుల్లో మార్పు, చేర్పులపై విచారణ షురూ



విచారణ చేపడుతున్న డీఎస్‌వో, తహసీల్దార్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల జారీతో పాటు కుటుంబ సభ్యుల పేర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించేలా ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఈమేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా భారీగా అప్లికేషన్లు వెల్లువెత్తాయి. ఇందులో అర్హులైన వారిని గుర్తించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగా అధికారులు మంగళవారం ఆ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎండీ. వాజిద్ అలీ, ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ పట్టణంలోని విద్యానగర్‌లో అర్హుల గుర్తింపు విచారణ చేపట్టారు. దరఖాస్తుదారుల ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేశారు. మార్పులు, చేర్పులతో పాటు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై క్షేత్రస్థాయిలో విచారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



శోభాయాత్రలో ఆడె గజేందర్ తదితరులు

బోథ్: మండలంలోని ధన్నూర్ బి గ్రామంలో శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ హాజరై పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బాపురెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేశ్, రాజు, సంతోష్, రవి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, కాంగ్రెస్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, రమణారెడ్డి, చంటి, అభిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అర్హతకు మించి వైద్యం



గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ అర్హతకు మించిన వైద్యం అందించాడు. ఓ గర్భిణికి అబార్షన్ కోసం మాత్రలు ఇచ్చాడు. సదరు మహిళకు అబార్షన్ కాగా, ఆమె మృతి చెందిన శిశువును ఊరి బయట వాగులో పడేసింది. ఆ గ్రామస్తులు చూడడంతో విషయం బయటపడింది. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసి కటకటాల పాలు చేశారు. వైద్య శాఖాధికారులు ఆ క్లినిక్‌ను సీజ్ చేశారు.



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న వైద్యశాఖ అధికారులు (ఫైల్)

☞ ఇచ్చోడ మండలకేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ అర్హత లేకున్నా ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. వేరే వ్యక్తి పేరిట సర్టిఫికెట్ తీసుకుని సదరు ల్యాబ్‌లో ఇంకొకరితో పరీక్షలు చేయిస్తున్నాడు. వైద్యశాఖ అధికారులు ఇటీవల తనిఖీ చేసి ల్యాబ్‌ను సీజ్ చేశారు. నార్నూర్, బేల మండల కేంద్రాల్లోనూ ఇలాగే ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. అధికారులు తనిఖీ చేసి వాటిని కూడా సీజ్ చేశారు.

- రెచ్చిపోతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- క్లినిక్‌లకు అనుబంధంగా ల్యాబ్‌లు, మెడికల్ స్టోర్లు
- ప్రత్యేక బృందాలతో వైద్యారోగ్య శాఖ తనిఖీలు
- అబార్షన్ మాత్రలు ఇచ్చిన ఓ ఆర్‌ఎంపీ కటకటాలపాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం అందిస్తున్నారు. వచ్చిరాని వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రథమ చికిత్స మాత్రమే అందించాల్సిన వీరు ఎలాంటి అర్హత లేకున్నా ఎంబీబీఎస్ వైద్యుల తరహాలో వైద్య చికిత్స చేస్తున్నారు. పేరు ముందర డాక్టర్‌గా అని కూడా రాసుకుంటున్నారు. ఏకంగా క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు దాని అనుసంధానంగా మెడికల్ షాప్, ల్యాబ్ వంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులు కానీ కొందరు ఆర్‌ఎంపీలుగా తమ పేరు ముందు డాక్టర్ అని కూడా పెట్టుకుని వైద్యం అందిస్తున్నారు. వీరి నిర్లక్ష్యంతో జిల్లాలో గతంలో అనేక మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయినా వీరి తీరులో మార్పు రావడం లేదు. ఇటీవల ఓ గర్భిణీకి ఆర్‌ఎంపీ మాత్రలు ఇవ్వడంతో అబార్షన్ జరిగింది. గర్భంలోనే మృతిచెందిన శిశువును బయట పడేయడంతో విషయం బయటకు పొక్కింది. పోలీసులు కేసు నమోదు చేసి ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకున్నారు.

దందా ఇలా..

కొంతమంది ఆర్‌ఎంపీలు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రంలో క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. డాక్టర్ల వలే రోగుల నుంచి వేలకు వేలు డబ్బులు దండుకుంటున్నారు. ఆదిలాబాద్‌లో ఎంబీబీఎస్ డాక్టర్లు, పీజీ చేసిన వైద్యులు సైతం ఉన్నా పదో తరగతి మించని వీరి క్లినిక్‌లు మాత్రం ఎప్పుడు చూసినా కిటకిటలాడుతున్నాయంటే అతిశయోక్తి లేదు. అలాగే గ్రామాల నుంచి ఆర్‌ఎంపీలు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను తరలిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. పలువురు వైద్యులు వారికి నజరానాలు ఇవ్వడం, విందులు ఏర్పాటు చేయడం వంటివి జరుగుతున్నాయి. ఆటోలో తీసుకొచ్చిన వారికి కమీషన్లు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా రోగుల అవసరాన్ని ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఆసరాగా చేసుకుంటున్నారు. క్లినిక్‌లో ప్రిస్కిప్షన్ రాసి అక్కడే వారు ఏర్పాటు చేసుకున్న మెడికల్ షాపులో మందులను విక్రయిస్తున్నారు. అలాగే కొంత మంది రోగుల బ్లడ్ శాంపిళ్లు తీసుకొని స్వయంగా రక్త, మూత్ర, తదితర పరీక్షలు నిర్వహిస్తూ వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు.

తనిఖీ బృందం ఏర్పాటు

నిబంధనలకు విరుద్ధంగా చెలామణి అవుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. ఇటీవల జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీబృందం ఏర్పాటు చేశారు. మాస్ మీడియా అధికారితో పాటు మరో అధికారి జిల్లాలోని ఆయా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీ క్లినిక్‌లు, ల్యాబ్‌లను తనిఖీ చేస్తుండగా, డిప్యూటీ డీఎంహెచ్‌వోతోపాటు పలువురు అధికారులు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు పాటించని క్లినిక్‌లు, ల్యాబ్‌లకు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఐదారు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను సీజ్ చేశారు. అర్హత లేకున్నా ల్యాబ్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఇచ్చోడ, బేల, నార్నూర్ తదితర మండల కేంద్రాల్లో ల్యాబ్‌లు సీజ్ చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నిబంధనలు అతిక్రమించే ఆర్‌ఎంపీలపై కఠిన చర్యలు తీసుకుంటాం. కొంతమంది ఆర్‌ఎంపీలు తమ స్థాయి మించి వైద్యం చేస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. క్లినిక్‌లు అని బోర్డులు పెట్టుకోవద్దు. పేరు ముందు వైద్యులు అని కూడా రాసుకోవద్దు. సెలైన్‌లు ఎక్కించడం, రక్త పరీక్షలు చేపట్టడం చట్టరీత్యా నేరం. మెడికల్‌షాప్‌లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయరాదు. అలాగే రోగులకు ప్రిస్కిప్షన్ రాయడం కూడా నేరమే. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

అభివృద్ధిలో నార్నూర్ భేష్



బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న కేంద్రబృందం ప్రతినిధులు, పక్కనే కలెక్టర్, ఐటీడీఏ పీవో

- మండలంలో పర్యటించిన కేంద్ర బృందం
- నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంపై ప్రశంస
- విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమశాఖ, ఐకేపీ, కేంద్ర పథకాలపై ఆరా

నార్నూర్: నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా పీఎం అవార్డు–2024కు ఎంపికైన నార్నూర్ మండలం అభివృద్ధిలో భేష్‌గా ఉందని కేంద్రం బృందం ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు డైరెక్టర్ మృత్యుంజయ ఝా, డిప్యూటీ సెక్రెటరీ శుభోద్‌కుమార్ మండలంలో మంగళవారం పర్యటించారు. ముందుగా జిల్లా కేంద్రానికి చేరుకున్న వారికి కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్వాగతం పలికారు. ఉదయం 10.30 గంటలకు జామ్‌డా గ్రామానికి చేరుకున్నారు. వీరికి ఆదివాసీ సంప్రదాయ పద్ధతిన గ్రామస్తులు స్వాగతం పలికారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మాతా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బరువు తక్కువ ఉన్న పిల్లల ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా అందజేస్తున్న పోషకాహార వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలామృతం, గుడ్లు వంటి పౌష్టికాహారం అందిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. అలాగే రక్తహీనత బాధితులను గుర్తించి ఉట్నూర్ ఎన్‌ఆర్‌సీ లేదా ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. అదే గ్రామంలో ఉన్న బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఐటీడీఏ ద్వారా గిరిజన విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు పీవో వివరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. రక్తహీనత నివారణకు మొవాహ్ లడ్డూలను అందజేస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి సబ్‌సెంటర్ భవన్, ఎంపీపీఎస్‌ను సందర్శించారు. విద్యాబోధన అమలుతీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎంఈవో అనిత వివరించారు. అనంతరం తాడిహత్నూర్ సమీపంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పాంలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందుతుందా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. పీఎం కిసాన్ పథకం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల ఆర్థిక స్వావలంభన కోసం అందిస్తున్న పథకాలను పరిశీలించారు. ఇప్పటి వరకు గ్రామంలో ఎన్ని యూనిట్‌లు మంజూరు చేశారు.. వాటి వినియోగం ఎలా ఉంది.. తదితర వివరాలను గ్రూపు సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారు తయారు చేసిన వెదురు బొమ్మలను పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు, రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. సబ్‌సెంటర్‌లో కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ప్రతీ కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో అయ్యేలా 102, 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకుంటున్నామని డీఎంహెచ్‌వో నరేందర్ వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో వారు సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా టాప్ 30లో రెండో స్థానంలో నార్నూర్ మండలం ఎంపికైందని తెలిపారు. ఇందులో భాగంగా మండలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పని తీరు బాగుందని ప్రశంసించారు. వారి వెంట ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి, డీఈవో ప్రణీత, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి మిల్కా, డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్,ఐటీడీఏ డీడీ అంబాజీ జాదవ్, ఐటీడీఏ ఈఈ తానాజీ జాదవ్, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర బృందానికి స్వాగతం

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ కింద ఎంపికైన నార్నూర్ మండలంలో పర్యటించేందుకుగాను జిల్లాకు మంగళవారం విచ్చేసిన కేంద్ర బృందం ప్రతినిధులను కలెక్టర్ రాజర్షి షా మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ గెస్ట్ హౌస్‌లో కలసి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. జిల్లాకు సంబంధించిన స్థితిగతులను వారికి వివరించారు.

విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలి

నేరడిగొండ/బజార్‌హత్నూర్: విద్య, ఉపాధి రంగాల్లో వెనుకబడిన ఆదివాసీ పర్ధాన్‌లకు అవకాశాలు కల్పించాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ఉయిక సుదర్శన్ అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని తొమ్మిది ఆదివాసీ గిరిజన తెగల్లో వెనుకబాటులో ఉన్న పర్ధాన్ తెగ అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేయాలన్నారు. అలాగే హీరాసుక్కా జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని విన్నవించారు. ఆయన వెంట పుర్క జంగురావు, ఇచ్చోడ మార్కెట్ డైరెక్టర్ నాగేశ్వర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సిడాం ఉత్తమ్, కేశవ్, గణేశ్, సుభాష్, నాగనాథ్, గంగాసాగర్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యదేవరాజన్‌కు వినతిపత్రం అందజేస్తూ..

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

- ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ యకాద్రి

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయ శాఖ, కేవీకే శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్ డైరెక్టర్ యకాద్రి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఐసీఏఆర్ నాగ్‌పూర్, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులు అధిక సాంద్రతతో సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చి లాభాలు గడించవచ్చన్నారు. పత్తితో పాటు అంతర పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా వర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు, పంటల వివరాలు, దిగుబడులను వివరించారు. కిసాన్ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన ఆయా విత్తనాలు, పరికరాల స్టాళ్లను రైతులు సందర్శించారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ నాగ్‌పూర్ నోడల్ అధికారి శాంతి, ఏడీఆర్ సుజాత, ప్రొగ్రాం అధికారి ప్రవీణ్ కుమార్, వ్యవసాయ విశ్వ విద్యాలయం అసొసియేట్ డీన్ శ్రీధర్ చౌహన్, శాస్త్రవేత్తలు రాజశేఖర్, రాంప్రసాద్, సునీల్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యకాద్రి

ఫ్చ్.. నిరాశే!

- 'యంగ్ ఇండియా' మంజూరులో జిల్లాకు మొండిచేయి
- వసతులు ఉన్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో తూర్పు ప్రాంతానికే ప్రాధాన్యత
- నాణ్యమైన విద్యకోసం జిల్లావాసులకు తప్పని నిరీక్షణ



నిషాన్‌ఘాట్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)

కైలాస్‌నగర్: నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరులో జిల్లాకు నిరాశే ఎదురైంది. 2500మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ విద్యార్థులకు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో చేపట్టనున్న ఈ పాఠశాలల ఏర్పాటులో ప్రభుత్వం జిల్లాకు మొండిచేయే చూపింది. తొలి విడతలో మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వం ఆదివాసీలు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ జిల్లాను విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల ఏర్పాటుకు అవసరమైన అన్ని వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లాను పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

ఇదీ పరిస్థితి...

పేద విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, నైపుణ్యశిక్షణ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు క్రీడలు, వృత్తినైపుణ్యంతో కూడిన నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అసెంబ్లీ నియోజకవర్గానికో పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు అవసరమైన స్థలాలు గుర్తించాల్సిందిగా ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఒక్కో పాఠశాలకు 25 ఎకరాల విస్తీర్ణంతో కూడిన స్థలాలను అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. పది నియోజకవర్గాలకు సంబంధించి స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు పంపించారు. పాఠశాలల ఏర్పాటుకు అవసరమైన అన్ని వనరులు సిద్ధంగా ఉండటంతో జిల్లాలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనంద అందనందని అంతా భావించారు. అయితే ప్రభుత్వం మాత్రం జిల్లాను పట్టించుకోలేదు.

స్థలాలు సిద్ధంగా ఉన్నా..

తరగతి గదులు, వసతిగృహాలు, ఆటస్థలం వంటి సౌకర్యాలకు అనుగుణంగా ఉండేలా ఒక్కో పాఠశాలను 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ భవన నిర్మాణాలను వచ్చే రెండేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా అవసరమైన స్థలాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ఎంపిక చేశారు. ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో పది నియోజకవర్గాల్లోనూ రెవెన్యూ అధికారులు స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే జిల్లాలోని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి గాను ఆదిలాబాద్ రూరల్ మండలం నిషాన్‌ఘాట్‌లో, బోథ్ నియోజకవర్గానికి సంబంధించి ఇచ్చోడ మండలం ఆడెగామ గ్రామంలో 25 ఎకరాల స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు.

జిల్లాకు మొండిచేయి...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది నియోజకవ్గరాలకు ఈ పాఠశాలలు మంజూరు కావాల్సి ఉండగా రాష్ట ప్రభుత్వం తూర్పు ప్రాంతానికే ప్రాధాన్యతనిచ్చింది. మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించి దండెపల్లి మండలం రెబ్బనపల్లి, చెన్నూర్ నియోజకవర్గానికి సోమనపల్లి, కుమురంభీం జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి వాంకిడి మండలం ఇందానిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేసింది. అయితే ఇందులో ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఏడు నియోజకవర్గాలను విస్మరించింది. అత్యధికంగా ఆదివాసీలు, వెనకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్‌కు ఒక్క పాఠశాలను మంజూరు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతోనే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయం వ్యక్తమువుతుంది.

ఉమ్మడి జిల్లాకు మూడు మంజూరు..

ఉమ్మడి జిల్లా పరిధిలోని మంచిర్యాల జిల్లాకు రెండు, ఆసిఫాబాద్ నియోజవకర్గానికి ఒక పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.200 కోట్లతో చేపట్టనున్న భవన నిర్మాణాలకు గాను తొలివిడతగా ఒక్కో పాఠశాలకు రూ.30 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. మిగతా నియోజకవర్గాల్లో మలి విడతలో మంజూరు ఉంటుంది.

– అశోక్, టీజీఈడబ్ల్యూఐడీసీ, ఆదిలాబాద్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుడిమల్ల రాజు లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్‌లో విద్యుత్ శాఖలో జేఎల్‌ఎం గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వడ్యాల్‌లో సిబ్బందితో కలిసి విద్యుత్ బిల్లులు వసులు చేశారు. మధ్యాహ్నం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కనకాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఖానాపూర్ వైపు నుండి వేగంగా వస్తున్న కారు రాజు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ముందుగా నిర్మల్ ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ప్రొబేషనరీ ఎస్సై జుబేర్, ఏఎస్సై నారాయణరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

టిప్పర్, బైక్ ఢీకొని ఇద్దరికి ...



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

దస్తురాబాద్: బుట్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నూర్ గ్రామ సమీపంలో మంగళవారం టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చెన్నూర్‌కు చెందిన శంకర్‌గౌడ్, కలమడుగుకు చెందిన రాకేశ్ ద్విచక్ర వాహనంపై కలమడుగు నుంచి చెన్నూర్‌కు వస్తుండగా పాండ్వాపూర్-కలమడుగు రహదారిపై టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జగిత్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శంకర్ గౌడ్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

సిరికొండ: ఎడ్లబండ్లపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు ఫారెస్టు డివిజన్ అధికారి రేవంత్‌చంద్ర తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి గోపాల్‌పూర్ గ్రామ శివారులో మారుతిగూడకు చెందిన వ్యక్తులు రెండు ఎడ్లబండ్లపై కలపను తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులు పారిపోయారని, కలపను, ఎడ్లబండ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కలప విలువ రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడిలో సిరిచెల్మ ఎఫ్‌ఆర్వో నాగవత్ స్వామి, ఇంద్రవెల్లి ఎఫ్‌ఆర్వో సంతోష్, సిరికొండ డీఆర్వో నరేష్, తదితరులు ఉన్నారు.

కానుకలు వద్దు.. నగదే ఇద్దాం!

- మంగళీమోట్ మహిళ వినూత్న ఆలోచన
- ఆడపిల్ల పెళ్లికి వస్తువులకు బదులు నగదే ఇవ్వాలని నిర్ణయం..
- ఆదివాసీ మహిళ ఐడియా.. జిల్లా అంతా ఆచరణ
- పెళ్లి కూతుళ్లకు నగదు ఇస్తూ అండగా నిలుస్తున్న గూడేలు



పెళ్లికూతురుకు నగదు అందజేస్తున్న మహిళలు (ఫైల్)



మెస్రం శ్రీదేవి

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం త ర్నం(బి) పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన మంగళీమోట్ ఆదివాసీ మహిళలు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఆడపిల్లల వివాహం కుటుంబ పెద్దకు భారం కాకూడదని భావించి వివాహ సమయంలో కట్నకానుకల కింద ఇచ్చే ఇత్తడి, వెండి, స్టీల్ సామగ్రికి బదులు నగదు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. ఆదివాసీ మహిళలు తీసుకున్న ఈ నిర్ణయం ప్రసుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంప్రదాయబద్ధంగా మారింది. ఆదివాసీ గూడేల్లో ఎక్కడ పెళ్లి జరిగినా కట్నకానుకలు తీసుకోవడం లేదు. వాటికి బదులుగా తోచినంత నగదు అందించి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

వయసు చిన్నది..ఆలోచన పెద్దది

మంగళీమోట్ గ్రామానికి చెందిన మెస్రం శ్రీదేవి ఐదోతరగతి నుంచి పదోతరగతి వరకు నేరడిగొండ మండలంలోని లఖంపూర్ ఆశ్రమ పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించింది. ఐటీడీఏ తరఫున హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. జీఎన్‌ఎం ట్రైనింగ్ పూర్తి చేసి కొంతకాలం ప్రైవేట్ ఉద్యోగం చేసింది. 2018లో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెళ్లిళ్లలో కట్నం కింద సామగ్రి ఇస్తుండడంతో డబ్బులు వృథా అవుతున్నాయని శ్రీదేవితో పాటు పలువురు మహిళలు గుర్తించారు. ఈ మేరకు కట్నకానుకలు నిషేధించి వాటికి బదులుగా నగదు ఇవ్వడంతో పెళ్లి కూతురు ఇంటి పెద్దకు కొంత ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు అవుతుందని భావించి గ్రామస్తులకు విషయాన్ని తెలియజేసింది. గ్రామపెద్దలు సైతం ఆమెతో ఏకీభవించారు. ఇక నుంచి కట్నం కింద వస్తువులు ఇవ్వడం నిషేధమని తీర్మానించి అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మార్చి 3న మంగళీమోట్‌లో జరిగిన వసంత వివాహానికి ఊరి ఆడపడుచులంతా కలిసి రూ.20 వేల నగదును అందజేశారు. మారుమూల గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గూడేల ప్రజలను ఆలోచింపజేసింది.

ఇటీవల పలుచోట్ల ఇలా..

- ఈనెల 14న సిరికొండ మండలంలోని కోసుపటేల్‌గూడకు చెందిన యువతి వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.20 వేల నగదు అందజేశారు.
- ఈ నెల 20న ఇంద్రవెల్లి మండలం సమాకలో తొడసం గౌరుబాయి వివాహం కొట్నక్ దేవ్‌రావుతో జరిగింది. గ్రామస్తులు ప్రతీ ఇంటి నుంచి రూ.200 జమచేసి రూ.24,900 నగదును కట్నకానుకలకు బదులుగా అందజేసినట్లు గ్రామ పటేల్ పెందూర్ భగవంత్‌రావు తెలిపారు.
- ఈ నెల 20న బజార్‌హత్నూర్ మండలంలోని అనంత్‌పూర్ గ్రామానికి చెందిన సేవంతకు ఇచ్చోడ మండలంలోని బొజ్జుగూడకు చెందిన నగేష్‌తో వివాహం జరిగింది. గ్రామస్తులంతా కలిసి రూ.22 వేల నగదు అందించి అండగా నిలిచారు.

గర్వంగా ఉంది



మా గూడెంలో తీసుకున్న నిర్ణయం పలు గూడేల్లో అమలు చేయడం గర్వంగా ఉంది. కాలానికి అనుగుణంగా నడుచుకోవాలి. 50 ఏళ్ల క్రితం కట్నకానుకలు లేకుండానే పెళ్లిళ్లు జరిగేవి. వరుడు వధువు ఇంటివద్ద, వధువు వరుడి ఇంటివద్ద నెలరోజులు పనులు చేసేవారు. వారి పని నచ్చితే పెద్దలు వారిద్దరికి వివాహం జరిపించేవారు.– కుంర భీంరావు, భూమవ్వ, మంగళీమోట్, గ్రామపటేల్ దంపతులు

అరుదైన పక్షి



దహెగాం మండల కేంద్రంలో మంగళవారం అరుదైన పక్షి కనిపించింది. ఎండవేడికి తట్టుకోలేక దుకాణ సముదాయాల్లోకి వచ్చింది. స్థానికులు పట్టుకుని నీటిని తాగించారు. ఎఫ్‌ఎస్‌వో సద్దాం దృష్టికి తీసుకెళ్లగా దీని పేరు గోల్డెన్ ఓరియల్ అని పేర్కొన్నారు. ఇది అటవీ ప్రాంతాల్లో కనిపిస్తుందన్నారు. – దహెగాం

విద్యార్థుల జంగల్ సఫారీ



హాజీపూర్ మండలం గఢ్‌పూర్ మండల పరిధిలోని ఎంసీసీ క్వారీలో గల జంగల్ సఫారీలో మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు చెందిన బీజెడ్‌సీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రెక్కింగ్ చేశారు. అటవీ ప్రాంతంలో పర్యటిస్తూ వివిధ రకాల చెట్లతో పాటు మెడికేటెడ్ చెట్లు, వివిధ రకాల పక్షులు, జంతువుల గురించి తెలుసుకున్నారు. గడ్డి వనాలు, ఎత్తయిన కొండలు, అటవీ అందాలను తిలకించారు. ఎఫ్‌బీవోలు రాజేందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

ఏటీఎం కార్డు మార్చి.. రూ.40వేలు నొక్కేసి..!



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ఆదర్శ్

భైంసాటౌన్(ముధోల్): ఏటీఎంలో నగదు విత్‌డ్రా చేసేందుకు వచ్చిన ఓ యువకుడిని ఏమార్చి అతని కార్డును తన వద్ద ఉన్న కార్డుతో మార్చి నగదు తస్కరించిన ఘటన భైంసా పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని దేగాంకు చెందిన ఆదర్శ్ బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసేందుకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఏటీఎంకు వచ్చాడు. డబ్బులు విత్‌డ్రా చేస్తున్న క్రమంలో చింతల్‌బోరికి చెందిన జాదవ్ బాలాజీ డబ్బులు డ్రా చేసిస్తానని చెప్పి అతని కార్డు తీసుకున్నాడు. కొద్దిసేపటికి డబ్బులు రావడం లేదని, బ్యాంకులో అడగాలంటూ తన వద్ద కార్డు మార్చి ఇచ్చాడు. గమనించని ఆదర్శ్ పని నిమిత్తం గ్రామానికి వెళ్లగా రూ.పదివేల చొప్పున రూ.40వేలు డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే భైంసాకు చేరుకుని ఏటీఎం పరిసరాల్లో గాలించగా సదరు వ్యక్తి కనిపించాడు. నిలదీయగా పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు. పోలీసులు అతని వద్ద తనిఖీ చేయగా ఆదర్శ్ ఏటీఎం కార్డు, జేబులో నగదు లభించింది.

జవహర్ నవోదయకు 63 మంది ఎంపిక

కుంటాల(ముధోల్): జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరానికిగానూ ఆరోతరగతిలో ప్రవేశానికి జనవరి 18న నిర్వహించిన పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కుంటాలలోని సృజన విద్యాలయంలో 34, విజయసాయి పాఠశాలలో ఇద్దరు, శాంతినికేతన్ పాఠశాలలో 15, కల్లూర్‌లోని శ్రీసాయి మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాళ్లు కొత్తకాపు గంగన్న, సంతోష్, శ్రీకాంత్, బోగ ప్రవీణ్, స్వప్న తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన భగత్‌కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని తాటిగూడకు చెందిన కలీమొద్దీన్ అలియాస్ కల్లు ఇంటి వద్ద నుంచి మంగళవారం మధ్యాహ్నం గంజాయి తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా కలీమొద్దీన్‌పై ఇదివరకే పలు కేసులతో పాటు సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. ఇదివరకే ఆయనను బైండోవర్ సైతం చేయడం జరిగిందన్నారు. భగత్‌కృష్ణను అరెస్టు చేసి బైండోవర్ చేయగా, కలీమొద్దీన్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

స్తంభం పైనుంచి పడి లైన్‌మెన్‌కు గాయాలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా కిందపడడంతో లైన్‌మెన్‌కు గాయాలైనట్లు విద్యుత్‌శాఖ ఏడీ ప్రభాకర్ తెలిపారు. లైన్‌మెన్ రాజు మరమ్మతు పనులు చేస్తుండగా పైన ఉన్న 33 కేవీలైన్ వైరు కింద ఉన్న లైన్‌వైరుకు తాకడంతో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఏడీ పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

రామకృష్ణాపూర్: పట్టణంలో నివసించే ఓ బాలిక(10)తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బాలిక నో రుమాసి ఇంట్లోకి రమ్మని అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పులికుంట గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై డీ.చంద్రశేఖర్ తెలిపారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, ఒంటిపై నలుపురంగు నైట్‌ప్యాంటు, నల్లని చారల చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చన్నారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఆరుగురికి స్వల్పగాయాలు



108లో క్షతగాత్రులు

సారంగాపూర్(నిర్మల్): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లోని శంకర్‌నాయక్ తండావాసులు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా సారంగాపూర్-అడెల్లి గ్రామాల మధ్య కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో అందులో ప్రయాణిస్తున్న రాథోడ్ మారుణిబాయి, సీలాబాయి, సవిత, శశికళ, అన్నపూర్ణ, రతన్‌సింగ్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందివ్వడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.


గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య



విష్ణువర్ధన్ (ఫైల్)

దండేపల్లి: గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసినొద్దీన్ తెలిపిన వివరాల మేరకు లక్సెట్టిపేట పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి భూమి విష్ణువర్ధన్ (22) రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం బైక్ తీసుకుని ఇంటినుండి బయటికి వెళ్లాడు. రాత్రి సమయంలో బైక్ గూడెం గోదావరి వంతెనపై నిలిపి ఉంచినట్లు తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మంగళవారం ఉదయం గోదావరి వద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలి ఉంది. మృతుడు ఆరు నెలల కిత్రం ప్రేమ వివాహం చేసుకున్నాడు. మృతుని సోదరుడు మణిదీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

గొడిసిర్యాలలో పురుగుల మందు తాగి మరొకరు ...



నేరెళ్ల అశోక్

దస్తురాబాద్: పురుగుల మందు తాగి యువకుడు బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం మండలంలోని గొడిసిర్యాలలో చోటు చేసుకుంది. ఎస్సై సీ.అశోక్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నేరెళ్ల అశోక్ (23) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం అతని చిన్నాన్న కుమారుడు పానుగంటి పవన్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి డిప్రెషన్‌కు లోనయ్యాడు. గొడిసిర్యాల ఎక్స్‌రోడ్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో అతని తమ్ముడు పవన్ ఆత్మహత్య చేసుకున్న స్థలంలోనే అశోక్ పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు జన్నారంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసర గోదావరిలో దూకి మహిళ ...

బాసర(నిర్మల్): బాసర గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన అనురాధ (35)కు అదే గ్రామానికి చెందిన సాయిలుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయిలు నిత్యం మద్యం సేవించి ఇంటికివచ్చి వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైంది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లింది. మంగళవారం తల్లి రాజవ్వకు ఫోన్‌చేసి విషయం తెలిపింది. అనంతరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా మరణాయుధాలతో సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన వ్యక్తిపై సుమోటో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారిగూడకు చెందిన సలీం ఖాన్ సోషల్ మీడియాలో తల్వార్‌తో ఒక పోస్టును పెట్టడం జరిగిందన్నారు. సుమోటో కేసుగా నమోదు చేసి మంగళవారం సలీం ఖాన్‌పై ఆమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఇదివరకే సలీం ఖాన్ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమెరికాలో మెరిసిన యశిక



మాధవరపు యశిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన మాధవరపు యశిక ప్రతిష్టాత్మకమైన యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్(యూఎస్‌ఎంఎల్‌ఈ)లో అరుదైన ఘనత సాధించింది. రెండు విడతలుగా జరిగిన పరీక్షల్లో ఫ్యామిలీ మెడిసిన్‌లో సీటు సంపాదించింది. మూడేళ్ల తర్వాత వచ్చే పీజీ పట్టాతో ప్రపంచంలోని ఏ దేశంలోనైనా వైద్యసేవలు అందించేలా అవకాశాన్ని అందిపుచ్చుకుంది. యశిక 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లో పూర్తి చేసింది. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలతో అనుసంధానమైన అమెరికా న్యూయార్క్‌లోని జేవియర్ వైద్య కళాశాలలోని ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) కోర్సును పూర్తి చేసి అమెరికాలోని చికాగోలో 18 నెలల స్టెప్–1, స్టెప్–2 క్లినికల్స్ కూడా పూర్తి చేసింది. తల్లిదండ్రులు శిల్ప, రాజేశ్వర్‌రావు రాజకీయాల్లో రాణిస్తున్నారు. యశికను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు హాజీపూర్ మండల వాసులు ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం: గంజాయి నియంత్రణపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్టులు, కేసుల దర్యాప్తులు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్‌కు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, గేమింగ్ యాక్ట్, తదితర కేసులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలీస్ అధికారి చట్టపరిధిలో పనిచేయాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పారదర్శకంగా, న్యాయపరంగా విచారణ జరపాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లను నియమించి సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో విలేజ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి విక్రయం, సేవించేవారిపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీలు ఎగ్గడి భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు రమేశ్, కృష్ణ, నరసింహులు, మల్లారెడ్డి, ఏఆర్‌ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై ప్రావీణ్యం పెంచుకోవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆంగ్లభాషపై విద్యార్థులు ప్రావీణ్యం పెంచుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోస్ సంస్థ అందిస్తున్న సేవలతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లోను విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఏసీఎం జగన్ మాట్లాడుతూ విద్యార్థి తలరాతను మార్చేది ఉపాధ్యాయులే అన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక, ఆంగ్ల నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన వారికి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎంవోలు ఉదవ్, రాథోడ్ శివాజీ, క్రీడల అధికారి పార్థసారథి, దేవ్‌రావు, బోస్ సంస్థ నిర్వాహకులు రోమిల, నిక్షిత, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యలపై త్రిసభ్య కమిటీ విచారణ



సుంకిడిలో విచారణ జరుపుతున్న సభ్యులు

తలమడుగు: మండలంలోని సుంకిడి, ఝరి గ్రామాల్లో ఇటీవల అప్పుల బాధతో ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు మంగళవారం గ్రామాల్లో విచారణ చేపట్టారు. కమిటీ సభ్యులైన ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి ఏడీ రాంకిషన్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సై అంజమ్మ, వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి ఝరి గ్రామానికి చెందిన రైతు గడం పోతారెడ్డి కుటుంబ సభ్యులను విచారించారు. రైతుకు ఎన్ని ఎకరాల పొలం ఉంది? కౌలుకు ఎన్ని ఎకరాలు తీసుకున్నాడు? పెట్టుబడి సాయం ఏబ్యాంకులో తీసుకున్నాడు? ప్రైవేట్ అప్పులు ఎంత తీసుకున్నారు? అని వివరాలు సేకరించారు. అనంతరం సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్న ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. రైతు వ్యవసాయ వివరాలు, పట్టా పాసు బుక్‌లను, బ్యాంక్ ఖాతాలు, అప్పులు, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.